# అదృష్టం

"కాఫీ అయినా తాగకుండా ఏమిటండీ పాత పుస్తకాలు తిరగవేస్తూ కూర్చున్నారు. పుణ్యమా! పురుషార్ధమా! నాలుగు రాళ్ళు సంపాదించే మార్గమేమయినా చూడండి" అని కాంతం అన్నది "ఆ మాట నిజమే" అని నేను అనుకొన్నాను.

అనుకొంటూనే నా డయిరీ పేజీ తరువాత పేజీ తిరగవేశాను. మదరాసులో నేనున్నప్పుడు వ్రాసినవి విజయనగరములో సంగతులూ ఎన్నో కనిపించినవి. నా విచిత్ర అనుభవాలన్ని చదువుకొని నాలో నేను నవ్వుకున్నాను. పాత స్నేహితులు స్నేహాలు జ్ఞాపకమునకు వచ్చినవి. ఇంకా పేజీలు తిరుగవేశాను. ఇంతలో డైరీ చివరకు వచ్చినాను. అక్కడ ఒకచోట,

"104, సంబంధ మొదలియారు వీధి తిరువళక్కేణి" అని వ్రాసియున్నది. దానిక్రింద ఎర్రగీత గీసి వున్నది.

ఆ చిరునామా ఎవరిదో నాకు ఎంతసేపటికి జ్ఞాపకం రాలేదు. జ్ఞాపకశక్తిని ఎంత త్రవ్వినా ఆ విషయమై ఏమీ స్ఫురణకు రాలేదు. ఇక ఏమై యుంటుందా అని ఊహించడం మొదలెట్టాను.

ప్రథమమున నాకు ఎవరో ప్రియస్నేహితుడు తన చిరునామా ఇచ్చి నన్ను అప్పుడప్పుడు చూస్తూ ఉండమని చెప్పి ఉంటాడని, తోచింది. పాపము అతడు నాకోసం ఎంతో కాలము నిరీక్షించి చివరకు విసికిపోయి ఉంటాడు. అతనికి ఎంత మనఃక్లేశము తెచ్చి పెట్టానా అని విచారపడ్డాను. తక్షణం వెళ్ళి అతనిని దర్శనం చేయటం నా కర్తవ్యము అని నిశ్చయించుకొన్నాను.

ఏ రయిలు బండిలోనో నాటకశాల వద్దనో పరిచయము కలిగిన సుకుమారి యొక్క చిరునామా యేమో అన్న తలంపు ఇంతలో నా తలలో తళుక్కుమన్నది. అప్రయత్నంగా నా శరీరం పులకరించినది. నేత్రములలోకి నూతన కళ ప్రవేశించింది. చిరునవ్వు పెదవులపయిన చిగిర్చినది. చెక్కిళ్ళపయిన చిరుచెమటలు పోసినవి. నిమిషంలోకి మెట్లు అన్ని ఎక్కి విరహావస్థలో పదో మెట్టుపై నుంచున్నాను. నాలిక

కొరుక్కొని ఎంత పొరబాటు జరిగిందిరా బాబూ అనుకొన్నాను. "రేపు సాయంత్రం వచ్చి నిన్ను కలుసుకొంటాను" అని బహుశా నేను ఆమెతో వాగ్దానం చేసి వుంటాను. ఆమె నాకోసం నిరీక్షించి నిరీక్షించి నిరాశ చెందినది కాబోలు.

"ఒంటి గూర్చున్న వేళ ప్రేమపుం దలపు రెక్కల విప్పి యెగసి తెలిసి తెలియని వింత సీమల యధేచ్ఛ సంచరించుచు దరహాసచంద్రికలను జిలుకు చెలికాని యౌవన కళల వెలుగు మధుర మోహన మూర్తిని మది లిఖించుకొనుచు నుందువు కాబోలు."

అని నాలో నేను కూనిరాగం తీస్తూ పాడుకొన్నాను.

లేకపోతే ఇది కాగూడదూ? ఎవరయినా పబ్లిషరు నాకు ఏదయినా పని ఇస్తాను రమ్మని పిలిచి ఉండకూడదూ? ఇదే అయి ఉంటుంది. ఎట్టి ముఖ్య విషయాన్ని మరచిపోయినాను ఏదో పుస్తకమో కథో వ్రాసి యిస్తే నాకు ఏ వందరూపాయలో యిచ్చెడి వాడు కదా! ఆ పయికం పెట్టి కాంతానికి ఒక సరుకో పిల్లకు ఒక నగో చేయించే వాడిని గదా! ఇంతకూ ప్రాప్తం లేదు. ప్రాప్తం లేనపుడు అట్లా ముంచుకొని వస్తుంది మరుపురోగం అని ఆత్మదూషణ చేసుకొన్నాను.

ఇంతకు ఏదీ తేలలేదు, ఆ విషయాన్ని గురించి ఆలోచించిన కొద్దీ ఆందోళన యెక్కువైనది. నిజము యేమిటో కనుక్కోవలెనని ఉత్సాహం కలిగింది.

ఆలోచించిన కొద్దీ ఆ విషయం మరీ గంభీరమైంది. ఈ మహా పట్టణంలో ఒక మూల ఎక్కడో ఒక యిల్లు. ఆ యింట్లో యెవరున్నారో నాకుతెలియదు, నేను అక్కడికి పోవలెను. చాలు. ఈ విషయంతో అపరాధన పరిశోధనా నవలను నడపవచ్చును.

అపరాధము, పరిశోధన అన్న రెండు మాటలు అనుకునేసరికి హత్యలు భయానకములగు దృశ్యములు, వికృత రూపములు, శోణితధారలు జ్ఞాపకమునకు వచ్చినవి. ఏడ్పులు, పెడబొబ్బలు, మెరుపులు, మేఘగర్జనలు, వినిపించినవి. భయంతో శరీరం వణికింది.

కవి అన్నాడు. "ఎడతెగని జలమింట, నడుమనో పడవంట," అల్లాగే విశాల ప్రపంచంలో ఒక యిల్లు, అది నేను కనుక్కోవటం ఇంత భయంకరమైన విషయాన్ని గూర్చి తలపోస్తుంటే వళ్ళు వణకదూ? వణుకుతుందా హృదయం శిలమయమై

పోతుందా? అనుభవము వున్నవాళ్ళకు తెలుస్తుంది. ఆ యింట్లో దయ్యాలు వుండవచ్చు. అవి నన్ను పీక్కు తినవచ్చు.

భవిష్యత్తులో యేముందో యెవరు దూరి చూచి చెప్పగలరు. ఆ యింట్లో యేమి వింతలు వున్నవో, ధనం దొరకకూడదా, వజ్రాలగని వుండకూడదా అని మళ్ళీ యింకో ఆలోచన. ఆ రాత్రి యేపని చేయటానికి నాకు తోచలేదు. ధైర్యం లేదు. భోజనం చేసిన తరువాత కాంతం తాంబూలం తెచ్చింది.

ఆవిడతో మాట్లాడటానికి నాకు మనస్కరించలేదు. ఏదో ఆలోచనలోకి దిగాను. మాంటిక్రిస్టో కథ, అమీనాకథ, అల్లావుద్దీను కథ జ్ఞాపకం వచ్చినవి. వసారాలో మా కాంతం, సుబ్బమ్మ మాట్లాడుతున్నారు.

"వజ్రం దొరికిందట అయనకు"

"ఎక్కడమ్మా?"

"ఊరి వెలుపల పాడుబడ్డ యింట్లోకి ఆయన యెందుకో వెడితే అక్కడ మెరుస్తూ కనిపించింది"

"అదృష్టం. ఎంత వెల వుంటుంది"

"నలభై వేలు అంటున్నారు!"

అని యేమిటో మాట్లాడుకొంటున్నారు. నిద్ర వచ్చీరాని స్థితిలో నాకీమాట వినిపించినవి. లెక్కలేని వూహలు నా మనోవిధిని నృత్యం చేసినవి.

చొక్కా కోటూ వేసుకొని బయలుదేరాను, వీధిలో టాక్సి సిద్ధంగా వుంది. త్వరగా అందులో యెక్కి యింటి నెంబరు వీధి చెప్పినాను. ఆగకుండ వాయువేగంతో వీధులు వెంటపోయి గమ్యస్థానము చేరినది.

టాక్సి ఆగింది. నేను దిగి తలుపు తట్టినాను. లోపలనుంచి యేదో మూలుగు మందంగా వినిపించింది. మళ్ళీ తలుపు కొట్టాను. "ఎవరు వారు" అని యెవరో అన్నారు. కంఠము హీనముగాను, కంపిస్తూను వున్నది కాబట్టి ఆమె రోగి అని నేననుకొన్నాను.

ఇంతలో లోపలినుంచి ఒక వికృత స్వరూపం మూడు కాళ్ళ ముసలిది వచ్చి

నన్ను చూచి "నాయినా, వచ్చావు? నిన్ను చూడాలనే యిన్నాళ్ళు ప్రాణాలు బిగబట్టుకొని వున్నాను మా నౌకరూ నీకు అడ్రసు యిచ్చి యెన్నాళ్ళయింది. ఇంతకాలము రాలేదేమి నాయినా" అన్నది. నేను మాట్లాడలేదు. మళ్ళీ ఆమె "నాయినా, మాట్లాడవేమి, నేను నీకు మేనత్తను నన్ను నీవు యెరుగవు. మీ మామ పరాయి దేశాలలో వుండి ధనము సంపాదించి చనిపోయినాడు. నాకూ అవసాన కాలము సమీపించి బ్రతుకనని నీకోసం కబురంపినాను. ఇప్పటికి వచ్చినావు."

"నాయినా, మాట్లాడలేను ఇవిగో తాళపు చెవులు" అని ధనపు పెట్టెల తాళాలు నాకిచ్చి ఆమె ప్రాణాలు విడిచింది.

నేను ధనవంతుడ్ని అయినాను పిల్లజమిందారును. సంతోషము పట్టలేకపోయాను. వాకిట్లో అప్పుడే వచ్చిన మోటారుబండి చప్పుడుకు మెలుకువ వచ్చింది.

ధనము దొరకటం స్వప్నానుభవము అయినా అది సుస్వప్నంగదా అని సంతోషము గలిగింది. కాలకృత్యాలు తీర్చుకొని బయలుదేరాను. నిజంగా, ఆ ఇంటికి వెళ్ళాను.

ఆ కలలో కనిపించిన ఇల్లె! ఇంతవరకు కల నిజము అయింది. మిగతాది ఎందుకు నిజం కాగూడదు? ఎన్ని కలలు నిజం కావటం లేదూ. దీపకర్ణి తనకు కొడుకు దొరుకుతాడని కల గనలేదూ?

అయినా ఏమో ధనప్రాప్తే ఉన్నదో, మిత్ర దర్శనమయ్యే యోగం ఉందో, లేక ఒక లావణ్యరాశి పాణిపల్లవముల గ్రహించి స్పర్శ సౌఖ్యము ననుభవించు మహాయోగం ఉన్నదో ఎవరు చెప్పగలరు అనుకొన్నాను.

లోపలికి పోయి కుర్చీలో కూర్చున్నారు. యజమాని పది నిమిషాలలో వస్తానన్నాడని కబురు వచ్చింది.

ఆయన వచ్చినాడు. నాకు పరిచయుడే. నా ప్రక్కన కూర్చుని కొన్ని కుశల ప్రశ్నలు వేసిన తరువాత, "ఏమోయి, ఎన్ని రోజులకు వచ్చినావోయి. మూడు రోజులలో యిస్తానని ముప్పది రూపాయలు పుచ్చుకొని చిరునామా కూడా వ్రాసికొని మూడు

నెలలైన తరువాత యిప్పుడా రావటం – బాగా వున్నది నీ మర్యాద, తెల్లపోతావేమి. ఇపుడు నీ దగ్గర లేకపోతే నా నౌకరిని నీ వెంట పంపుతాను. ఇంటికి తీసుకొనిపోయి పైకం ఇయ్యి" అన్నాడు.

నౌకరిని పిలిచి, – ఏమోయి వీరితో వెళ్లి మన కివ్వవలసిన పైకం తీసుకురా" అని చెప్పి "శెలవు" అని నాతో అని లోపలకి వెళ్ళాడు.

"ఎట్టి నిరాశ! ఆ ఔన్నత్యము! ఆపతనము! చెప్పటం ఎందుకు, ఇంటి దగ్గర పైకం లేదు. ఆ మాట చెపితే వాడు వినలేదు. శనిగ్రహం లాగ నన్ను పట్టుకొన్నాడు. సిరి అంటకపోయినా ఈ చీడ అంటింది. చివరకు జేబులో నుంచి కలం కాగితం తీసి నోటు వ్రాసి ఇచ్చి, ఇంటికి వెళ్ళిపోయినాను.

ఇంటిదగ్గర చేసి సిద్ధంగా ఉంచిన కాఫీ కొంచెం కొంచెం త్రాగుతూ జరిగిన విషయాన్ని తలచుకొని కాసేపు నవ్వుకొన్నాను.

*(ఆంధ్రభారతి మాసపత్రిక, ఫిబ్రవరి, 1928)*